

సిద్దిపేటలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



జిల్లాలోని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సిద్దిపేటలోని సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ ఆంటోనీ క్రీస్తుబోధనలను వినిపించారు. చర్చిల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాల ఆలాపన, ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు.

- సిద్దిపేట అర్బన్, మార్చి 29

అడవి పంది దాడిలో బాలుడి మృతి

- మేకలను తోలుకుని ఇంటికి వస్తుండగా..



స్వామి (ఫైల్)

సిద్దిపేటఅర్బన్, మార్చి 29: మేకలను తోలుకుని ఇంటికి వెళ్తున్న బాలుడిపై అడవి పంది దాడి చేసిన ఘటనలో అతను మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలలో చోటుచేసుకున్నది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లయ్య, ఏడో తరగతి చదువుతున్న అతడి కుమారుడు స్వామి (13) తమ వ్యవసాయబావి వద్ద మేకలను మేపడానికి వెళ్లారు. సాయంత్రం ఎల్లయ్య పొలం పనుల్లో నిమగ్నమయ్యాడు. స్వామి మేకలను తోలుకుని ఇంటికి బయలుదేరాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న చెట్లపొదల నుంచి ఒక్కసారిగా వచ్చిన అడవి పంది మేకలపై దాడి చేసింది. దీంతో మేకలు చెల్లాచెదురై భయంతో పరిగెత్తాయి. ఈ క్రమంలో అక్కడే ఉన్న బాలుడు స్వామిపై అడవి పంది దాడికి దిగింది. ఇది గమనించిన తండ్రి ఎల్లయ్య, ఆ పక్క పొలంలో పనిచేస్తున్న మరొకరు పరుగున వచ్చి అడవి పందిని బెదిరించగా అది అక్కడి నుంచి పారిపోయింది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



బీఆర్ఎ‌స్‌లో కుదుపు

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

- ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి సైతం
- సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతో చేరికపై స్పష్టత

నర్సాపూర్, మార్చి 29 : బీఆర్ఎస్‌కు పట్టున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ భారీ కుదుపునకు గురవుతోంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు ప్రారంభమవడం చర్చనీయాంశంగా మారింది. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడానికే నిర్ణయించుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు స్వయంగా వచ్చి బుజ్జగించినా కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడుగా పేరున్న మదన్‌రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. శుక్రవారం మదన్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరికపై చర్చించారు.

ఫలించని హరీశ్ బుజ్జగింపులు

మదన్‌రెడ్డి 2014, 2018లో వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ నుంచి నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మూడోసారి 2023లోనూ తనకే టికెట్ వస్తుందని ఎంతగానో ఆశించారు. అయితే, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి సునీతారెడ్డికి టికెట్ కేటాయించడంతో, అప్పట్లోనే పార్టీ మారుతారన్న ప్రచారం జోరుగా సాగింది. తన అనుచరులు కూడా ఒత్తిడి చేశారు. సీఎం కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు సముచిత స్థానం కల్పిస్తామని, పార్లమెంటు అభ్యర్థిగా అవకాశం ఇస్తామని హామీ ఇవ్వడంతో మదన్‌రెడ్డి టికెట్ త్యాగం చేశారు. సునీతారెడ్డి గెలుపు కోసం తనవంతు కృషి చేశారు. అయితే, పార్లమెంటు ఎన్నికలో టికెట్ ఇవ్వకపోగా తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్న మనస్థాపంతో మదన్‌రెడ్డి పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. కొన్నిరోజులుగా మైనంపల్లి హన్మంతరావుతో కాంగ్రెస్‌లో చేరికపై చర్చలు జరిపారు. ఈ విషయం తెలిసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఈనెల 26న కౌడిపల్లిలోని మదన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించారు. ఆ బుజ్జగింపులు ఏమాత్రం ఫలించకపోగా శుక్రవారం నేరుగా మైనంపల్లి హన్మంతరావు, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి, నాయకులు శేషసాయి రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డితో పాటు హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. పార్టీలో చేరిక విషయమై చర్చించారు. తన అనుచరగణంతో రెండు రోజుల్లో పార్టీల్లో పెద్దఎత్తున చేరేందుకు మదన్‌రెడ్డి నిర్ణయించుకోగా, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. అయితే మదన్‌రెడ్డికి నర్సాపూర్ నియోజకవర్గంలో బలమైన అనుచరగణం ఉంది. పలువురు జడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులు ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి క్యాడర్ వెళ్లకుండా ఏ మేర నివారిస్తారో చూడాలి. విశేషమేమంటే గత పార్లమెంటు ఎన్నికల సమయంలో అప్పటివరకు కాంగ్రెస్‌లో ఉన్న సునీతారెడ్డి బీఆర్ఎస్‌లో చేరగా ఈసారి పార్లమెంటు ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళుతున్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలో కలకలం

మనోహరాబాద్, మార్చి 29 : ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి సైతం మదన్‌రెడ్డితో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంతో గజ్వేల్ నియోజకవర్గంలో కలకలం రేగింది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీలో నెలకొన్న పరిస్థితులతో మనోవేదనకు గురైన ఎలక్షన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడుతున్నట్లు తెలుస్తుంది. ఆయన టీడీపీ హయాంలో డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గెలుపు కోసం మూడుసార్లు కృషి చేశారు. కాంగ్రెస్‌లో పార్టీలో చేరుతుండడంతో నియోజకవర్గంలో పలువురు ఆయన వెంట వెళ్లే అవకాశం ఉంది.



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మదన్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి



ఇది సిద్దిపేటరూరల్ మండలం పుల్లూరు గ్రామ శివారులోని వరి పంట. తలాపునే రంగనాయక్ సాగర్ కాలువ ఉన్నా.. తప్పని పరిస్థితుల్లో ట్యాంకర్ ద్వారా నీటిని పోస్తూ పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నాడీ రైతు. ఇక గ్రామంలో పెద్ద చెరువు అయిన వెంకటయ్య చెరువు సహా పలు చెరువుల్లో నీరింకిపోయింది.



చుక్కనీరు లేకుండా ఎండిపోయిన ఈ చెరువు గజ్వేల్ మండలం గిరిపల్లిలోని బ్రహ్మణకుంట. ఈ గ్రామానికి చెందిన రైతులు సుమారు వంద ఎకరాలను మల్లన్నసాగర్ సొరంగంతో పాటు రామాయంపేట కాలువ, గజ్వేల్ కాలువ ఇచ్చారు. కానీ, గ్రామంలోని చెరువుల్లో మాత్రం చుక్క నీరు వచ్చే పరిస్థితి లేదు.

తలాపునే కాలువలు అయినా.. తడిలేని పొలాలు

అడి ఆశలు

- ఎండిపోయిన చెరువులు
- దిక్కుతోచని రైతాంగం
- పంట కాపాడుకునేందుకు పాట్లు
- ట్యాంకర్ల ద్వారా పంటకు నీరు

గజ్వేల్/సిద్దిపేట రూరల్, మార్చి 29: తలాపునే నీరున్నా.. ఆ రైతుల పంటలు మాత్రం ఎండిపోతున్నాయి. కాలువల వల్ల తమ భూములకు సాగునీరు అందుతుందని ఆశించిన ఆ రైతుల ఆశలు అడియాసలయ్యాయి. గత ప్రభుత్వం ఘనంగా చెప్పుకున్న రంగనాయక్ సాగర్, మల్లన్నసాగర్ వంటివి అందుబాటులో ఉన్నా.. స్థానికంగా చెరువులకు నీరందే పరిస్థితి లేకపోవడంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పొట్టదశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లుపడుతున్నారు.

సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామ శివారులోనే రంగనాయక సాగర్ ప్రాజెక్ట్ ఉంది. ఇదే గ్రామం నుంచి ఈ ప్రాజెక్ట్ కాలువ వెళ్తుంది. కానీ, ఆ కాలువ ద్వారా గ్రామంలోని ఒక్క చెరువులోకి నీరు రాదు. దీంతో చిన్నపాటి వర్షాభావానికే ఇప్పుడా గ్రామంలో చెరువులన్నీ ఇంకిపోయాయి. వెంకటయ్య చెరువుతో సహా, పడమటి చెరువు, నాగులకుంట, మల్లయ్య కుంట తెట్టే కుంట తదితర చెరువులలో చుక్క నీరు లేదు. దీంతో గ్రామంలోని బోర్లు, బావుల్లో కూడా నీరు అడుగంటింది. గ్రామంలో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పుడది పొట్ట దశలో ఉంది. ఆ పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కాలువల ద్వారా చెరువులు నింపాలని కోరుతున్నారు.

గజ్వేల్ మండల పరిధి గిరిపల్లి గ్రామ రైతులది మరో రకం గోస. ఇక్కడి రైతులు అభివృద్ధికి మేము సైతం అంటూ ముందుకు వచ్చి సుమారు వంద ఎకరాలను మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే మార్గానికి, రామాయంపేట కాలువ, గజ్వేల్ కాలువ, మల్లన్నసాగర్ సొరంగానికి భూములు ఇచ్చారు. ఇందులో గజ్వేల్ కాలువ గిరిపల్లి మీదుగా వెళ్తున్నా.. చెరువుల్లోకి నీరు వదిలే పరిస్థితి లేదు. ఈ గ్రామానికి చుట్టూ ఉన్న గ్రామాల భూములకు సాగునీరు అందుతున్నా.. ఇక్కడి చెరువుల్లో మాత్రం చుక్కనీరు లేకుండా అడుగంటి పోయాయి.



రోజంతా పోసినా అర ఎకరం పారలేదు..

నాకున్న మూడు ఎకరాల్లో వరి సాగు చేశారు. బావిలో ఊరిన నీళ్ల మూడు గుంటలకు మాత్రమే పారుతున్నాయి. దీంతో ట్యాంకర్ ద్వారా పంటకు నీరందిస్తున్నా. ఐదు వేల లీటర్ల ట్యాంకర్ కిరాయి రూ. 450, నీటికి రూ.200 చొప్పున చెల్లించి రోజంతా పోసినా అర ఎకరం పారలదు. ఇప్పటి వరకు సుమారు 14 వేల ఖర్చు వచ్చింది.

-ఏర్వ కిరణ్, రైతు, పుల్లూరు

బస్వాపూర్ చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

కోహెడ, మార్చి 29 : కోహెడ మండలం బస్వాపూర్ శివారులో వాహనాల తనిఖీలు చేపట్టగా లెక్కచూపని రూ.2,16,500 నగదును శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తనిఖీల్లో దశరథం అనే వ్యక్తి నుంచి రూ.66వేలు, హుస్సేన్ అనే అతని నుంచి రూ.68,100, కూరాకుల యాదగిరి వద్ద రూ.82,500 నగదు పట్టుకున్నారు. హుస్నాబాద్‌లో జరిగే పశువుల సంతకు వెళ్తున్నట్లు చెప్పారని, లెక్కలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేట అంటే కళ్లమంట

- రఘునందన్‌కు ఓట్లడిగే హక్కులేదు
- సీఎం రేవంత్ కూడా జీర్ణించుకోలేదు
- ఎన్నికలు ఏవైనా.. దుబ్బాకగడ్డ గులాబీ అడ్డా
- బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గెలుపు ఖాయం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



దుబ్బాకలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట/దుబ్బాక, మార్చి 29: ఆనాడు సిద్దిపేట అభివృద్ధిపై విషం కక్కినవారంతా నేడు ఓట్ల కోసం వస్తున్నారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం సిద్దిపేటలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల నియోజకవర్గ స్థాయి సమావేశం, దుబ్బాకలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట అభివృద్ధి అంటే రఘునందన్‌కు కళ్లమంట అని ఆరోపించారు. దుబ్బాకను వదిలిపెట్టి సిద్దిపేటకే నిధులన్నీ తరలిస్తున్నారని మాయమాటలు చెప్పి ఉపఎన్నికలో ఎమ్మెల్యేగా విజయం సాధించారని గుర్తుచేశారు. నాలుగేళ్లలో కనీస అభివృద్ధి చేయని రఘునందన్‌ను చిత్తుగా ఓడించారని చెప్పారు. అలాంటి వ్యక్తికి సిద్దిపేటలో ఓట్లెందుకు వేయాలని అన్నారు. ఇక సిద్దిపేటకు మంజూరైన వెటర్నరీ కాలేజీని సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించారని ఆరోపించారు. చిన్నకోడూరులో ఫోర్‌లేన్ రోడ్డు నిధులను రద్దు చేశారని, శిల్పారామం పనులను మధ్యలోని నిలిపివేయించారని విమర్శించారు. తనకంటే ఎక్కువ మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని కోరారు.

దుబ్బాక ప్రజలు ఉద్యమకారులే

దుబ్బాకలో ఉన్నది నాయకులు కాదు.. కార్యకర్తలు కాదు.. ఇక్కడ ఉన్నది ఉద్యమకారులు.. ఇది ఉద్యమాలకు గడ్డ.. గులాబీ అడ్డా అని హరీశ్‌రావు అన్నారు. ఉద్యమానికి, పార్టీకి ఎంతమంది ద్రోహం చేసినా.. పార్టీ కష్టకాలంలో నిటారుగా నిలబడి జెండాను భుజానా మోసుకుని నడిపించిన చరిత్ర దుబ్బాకదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల్లో అమలు చేస్తామన్న హామీలు ఇంత వరకు అమలు కాలేదన్నారు. వీటన్నంటినీ ఏమార్చడానికి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఫోన్ ట్యాపింగ్ అని, శ్వేతపత్రాలని, అవినీతి అంటూ తెరపైకి తెచ్చి డ్రామాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగ్యారంటీలు అమలయ్యే వరకు కాంగ్రెస్ నాయకులను వదిలేదిలేదనీ, వారికి చుక్కలు చూపిస్తామన్నారు.

కాంగ్రెస్ టికెట్‌ను వద్దన్నా

తనకు కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేయమన్నా తాను చేయలేదని బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి వెల్లడించారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో తనకు 12 సంవత్సరాల సన్నిహిత అనుబంధం ఉందన్నారు. జూన్4న తాను గెలవబోతున్నానని, జూలై 4న రూ.100 కోట్ల నిధికి సంబంధించి పీవీఆర్ ట్రస్టును ఇక్కడే ప్రారంభిస్తామని ప్రకటించారు. ఆయా సన్నాహక సమావేశాల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, జడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు.

నా జీవితం తెరిచిన పుస్తకం

"నేను ఎక్కడా భూకబ్జాచేయలేదు.. ఎక్కడా ప్రభుత్వ కాంట్రాక్టులు చేయలేదు. ఎవరినీ మోసం చేయలేదు. ఎవడి దగ్గర నయాపైసా వసూల్ చేసిన చరిత్ర తనది కాదని తన జీవితం తెరిచిన పుస్తకమని" దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాకలో నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తన గురించి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. తనను భూకబ్జాదారుడిగా ఆరోపణలు చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ ఎంపీలకంటే ఎక్కువ నిధులను, పనులను సాధించానని, కావాలంటే రఘునందన్‌రావు పార్లమెంటు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు. డిపాజిట్ కూడా రాని కాంగ్రెస్ నాయకుడు సైతం విమర్శించడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



సిద్దిపేట సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు



మంకీ గన్‌కు యమక్రేజ్

- హుస్నాబాద్‌లో జోరుగా కొనుగోళ్లు

పల్లెల్లో, పట్టణాల్లో కోతుల బెడద అధికంగా ఉందనే విషయం తెల్సిందే. కోతుల వల్ల కొందరు రైతులు అయితే కొన్ని పంటలను సాగుచేయడమే మానేశారు అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటి నుంచి తప్పించుకునేందుకు రైతులు రకరకాల ప్రయోగాలు చేస్తూనే ఉంటారు. అయితే మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన పూనమ్ రాథోడ్ అనే మహిళ శుక్రవారం హుస్నాబాద్‌లో "మంకీ గన్"లను హుస్నాబాద్ అంగడికి తీసుకొచ్చింది. పైపులతో చేసిన ఈ గన్‌లో కార్బైట్ (మామిడి కాయలను పండించేందుకు వాడేది) వేసి కాస్త నీటిని కలిపి లైటర్‌తో వెలిగించి నొక్కితే భారీ శబ్దం వస్తుంది. ఆ శబ్దానికి కోతులు భయంతో పారిపోతున్నాయి. రూ.150 చొప్పున విక్రయించడంతో అంగడికి వచ్చిన ప్రజలు పెద్దఎత్తున కొనుగోలు చేశారు. కాసేపటికి వీటికి డిమాండ్ ఏర్పడడంతో రూ.200 చొప్పున విక్రయించింది.

- హుస్నాబాద్, మార్చి 29







మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరిస్తాం

● నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్



గుంతలను పూడ్చివేయిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్

నారాయణఖేడ్, మార్చి 29: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్‌దారం శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం పలు వార్డులలో కౌన్సిలర్లతో కలిసి వారు పర్యటించారు. పది, పదమూడు వార్డులలో చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, కౌన్సిలర్లు వివేకానంద్, సద్దాంలతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్ పట్టణంలోని ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఇసుక, సిమెంట్, కంకర మిక్సింగ్‌తో పూడ్చివేయించారు. రాజీవ్ చౌక్ సమీపం లోని బస్ షెల్టర్‌లో ఫ్లోరింగ్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడు తుండగా నాపరాళ్లు వేసి మెట్లను ఏర్పాటు చేశారు. ఆయా పనులను మున్సి పల్ వైస్ చైర్మన్ దారం శంకర్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

వీరభద్ర స్వామి ఆలయంలో పుష్పాభిషేకం

గుమ్మడిదల, మార్చి 29: బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి ఆలయాన్ని శుక్రవారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో శశిధర్‌గుప్తా ఆధ్వర్యంలో భక్తులు భద్రకాళి సహిత వీరభద్ర స్వామికి లక్ష కనకాంబర పుష్పాభిషేకం నిర్వహించారు. భద్రకాళి సహిత వీరభద్ర స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో ఉండాలని పుష్పాభిషేకం చేసినట్లు తెలిపారు.

హుస్నాబాద్‌లో అభివృద్ధి పనుల్లో వేగం

● తుది దశకు చేరుకున్న మున్సిపల్, రైతు బజార్ భవన నిర్మాణాలు




తుది దశకు చేరుకున్న రైతు బజార్ భవన నిర్మాణం

హుస్నాబాద్ టౌన్, మార్చి 29: హుస్నాబాద్ పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతున్నాయి. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకుంటు న్నాయి. ఆరేడు సంవత్సరాలు స్థల సమస్యతో భవన నిర్మాణానికి నోచుకో లేదు. హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ భవ నాన్ని నిర్మిస్తున్నారు. 2022 ఫిబ్రవరి 8వ తేదీన దీనికి శంకుస్థాపన చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్తులతో అధునాతనంగా దీనిని నిర్మాణం చేస్తున్నారు. అలాగే నిధులుండి ఎన్నో ఏండ్లుగా శిలాఫలకానికే పరిమితమైన రైతు బజార్ పనులు తుది దశకు చేరుకున్నాయి. పట్టణం లోని చావడి వద్ద రైతు బజార్‌ను రూ.3 కోట్లతో నిర్మాణం చేస్తున్నారు. పలు సమస్యలతో గత ఆరు సంవత్సరాలకు పైగా ఈ పనులకు మోక్షం కలుగలేదు. దీనికి మార్కెట్ శాఖ నుంచి నిధులు కేటాయించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్‌కు, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్ కోసం నిర్మాణం చేస్తున్నారు. అలాగే రూ. 50 లక్షలతో గ్రంథాలయ భవనం, రూ.2కోట్లతో ఏసీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయన భవనాలను ప్రారంభించనున్నట్లు సమాచారం.
















తపాస్‌పల్లిపైనే ఆశలు

ఎండుతున్న పంటలతో ఆందోళనలో రైతాంగం

- రిజర్వాయర్ నీటిని విడుదల చేయాలని వేడుకోలు
- కొనసాగుతున్న పంపింగ్
- కాలువల ద్వారా విడుదలకు సన్నాహం



తపాస్‌పల్లి రిజర్వాయర్

చేర్యాల, మార్చి 29: భూగర్భ జలాల నీటిమట్టం అడుగంటి, బోర్లు పనిచేయక పంటలు ఎండిపోతుండడంతో సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతంతో పాటు, సమీప మండలాల రైతులు కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటి కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం రెండవదశ ద్వారా ఐనాపూర్-తపాస్‌పల్లి గ్రామాల సరిహద్దులో 0.03టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్ రైతాంగానికి వరప్రదాయినిగా మారింది. గతంలో కేవలం వర్షాకాలంలో పంపింగ్ చేపట్టి చెరువులు నింపడంతో భూగర్భ జలాల నీటిమట్టం పెరిగి పంటలకు నీరందేంది. ఆ తర్వాత నీటి లభ్యతను బట్టి వేసవి కాలంలోనూ నీటిని ఎత్తిపోస్తూ కాలువల ద్వారా అందిస్తున్నారు. ఈసారి పంటలు ఎండుముఖం పడుతుండడంతో రిజర్వాయర్ నుంచి నీటిని అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



పంపింగ్ ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి చేరుతున్న గోదావరి జలాలు



కొమురవెల్లి శివారులో బోసిపోయిన కాలువ

చేర్యాల మండలం పెద్దరాజుపేటలో గేదెలకు ఆహారంగా మారిన వరి పంట

ఇటీవలే పంపింగ్ ప్రారంభం

దేవాదుల ప్రాజెక్టు గంగారం ఇన్‌టేక్ వెల్ నుంచి కొన్ని రోజుల క్రితమే నీటి పంపింగ్ ప్రారంభించడంతో ధర్మసాగర్, స్టేషన్‌ఘన్‌పూర్, బొమ్మకూరు రిజర్వాయర్ల మీదుగా తపాస్‌పల్లికి నీరు చేరుతున్నది. ఆన్ అండ్ ఆఫ్ సిస్టం ప్రకారం సెకనుకు వెయ్యి లీటర్ల సామర్థ్యంతో నీరు చేరుతుంది. ఇక్కడి నుంచి చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట, బచ్చన్నపేట, కొండపాక మండలాలకు కాలువల ద్వారా కొంతమేర మళ్లిస్తున్నారు. రైతులు కాలువలో బోరు వేసుకుని నీటిని వాడుకునేలా చర్యలు తీసుకోవడంతో ఊరట చెందుతున్నారు. అయితే ఒకేసారి అన్ని మండలాలకు విడుదల చేస్తుండడంతో పలు గ్రామాలకు చేరడం లేదు. కాలువలు బోసిపోయి దర్శనమిస్తుండడంతో తమకూ నీళ్లందించాలని రైతులు పట్టుబడుతున్నారు.

చెరువులు నింపాలని వేడుకోలు

రిజర్వాయర్‌కు కుడి, ఎడమ కాలువలు ఉండగా ప్రస్తుత నీటి లభ్యత దృష్ట్యా పలు గ్రామాలకు మళ్లిస్తున్నారు. మరికొన్ని గ్రామాలకు ఇప్పటికీ నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రిజర్వాయర్‌ను పూర్తిగా నింపడంతో పాటు కాలువలకు పరిమితం చేయకుండా చెరువుల్లోకి నీటిని మళ్లించాలని రైతులు కోరుతున్నారు.

ఇన్ ఫ్లో తక్కువగా ఉంది

బొమ్మకూరు నుంచి పంపింగ్ చేపట్టడంతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుంది. ఇన్ ఫ్లో తక్కువగా ఉన్నప్పటికీ నిర్దేశిత మట్టానికి నీరు చేరడంతో కాలువల ద్వారా నీటిని అందిస్తాం. చెరువులు నింపే పరిస్థితి ప్రస్తుతం మాత్రం లేదు.

- రాజశేఖర్, ఏఈ, తపాస్‌పల్లి రిజర్వాయర్

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఆంజనేయులు



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీ ఆంజనేయులు

హత్నూర, మార్చి 29: సంగారెడ్డి జిల్లా హత్నూర జడ్పీటీసీ పొట్లచెర్వు ఆంజనేయులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో తన అనుచరులతో కలిసి సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించినట్లు జడ్పీటీసీ పేర్కొన్నారు. అదే విధంగా పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకొని రావాలని రేవంత్‌రెడ్డి సూచించినట్లు ఆంజనేయులు స్పష్టం చేశారు.

రఘునందన్ దమ్ముంటే సంగారెడ్డికి రా..

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నరహరిరెడ్డి

సంగారెడ్డి రూరల్, మార్చి 29: రఘునందన్‌రావుకు దమ్మూ, ధైర్యం ఉంటే సంగారెడ్డికి రావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి సవాల్ విసిరారు. సంగారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలపై స్థాయి మరిచి విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతంలో రఘునందన్‌రావు తన బతుకు ఎలా ఉండేదో గుర్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యమాల పేరుతో భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడి ఈ స్థాయికి ఎదిగాడని ఆరోపించారు. నాడు పార్టీకి చెడ్డపేరు తెస్తున్నాడనే బీఆర్ఎస్ నుంచి వెలివేశారని గుర్తు చేశారు. రఘునందన్‌రావు స్థానికత గురించి మాట్లాడుతున్నాడని, అసలు ఆయనది దుబ్బాకనే కాదని బొప్పారం నుంచి వచ్చి మెదక్‌లో పెత్తనం చెలాయిస్తామంటే ప్రజలు ఊరుకోరని స్పష్టం చేశారు. దుబ్బాక ప్రజలు ఛీ కొట్టినా ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతావని ప్రశ్నించారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో చెల్లుతుందా అని నరహరిరెడ్డి ప్రశ్నించారు. సమావేశంలో సీడీసీ మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్తయ్యయాదవ్, నర్సింలు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు నవజాత శిశువులు, తల్లి మృతి

- పంతుల్‌తండాలో విషాదం

అక్కన్నపేట, మార్చి 29: పెళ్లైన ఎనిమిది సంవత్సరాల తర్వాత గర్భం దాల్చిన మహిళతో పాటు ఇద్దరు నవజాత శిశువులు మృతిచెందిన విషాద సంఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం పంతుల్‌తండాలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... లావణ్య, శంకర్‌కు ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వారు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి, అక్కడే ఉపాధి పొందుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్నారు. కాగా ఐదునెలల క్రితం లావణ్య గర్భం దాల్చింది. కొన్ని రోజుల క్రితం ఆమెకు జ్వరం రావడంతో ఆస్పత్రిలో చూపించగా వైద్యులు టైఫాయిడ్ అని నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లావణ్య కడుపునొప్పితో బాధపడుతుండడంతో వైద్యులు పరీక్షించగా గర్భంలోని ఇద్దరు నవజాత శిశువులు మృతిచెందినట్లు గుర్తించారు. ఆపరేషన్ చేసి శిశువులను బయటకు తీసిన తర్వాత లావణ్య కూడా మృతిచెందింది. లావణ్యతో పాటు నవజాత శిశువులు మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పీఎఫ్ క్లెయిమ్స్‌పై గీతమ్‌లో చర్చాగోష్ఠి

పటాన్‌చెరు రూరల్, మార్చి 29: భవిష్య నిధి(పీఎఫ్) క్లెయిమ్‌లు, చట్టబద్ధమైన అంశాల పునరావలోకనంపై శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో చర్చాగోష్ఠి నిర్వహించారు. హైదరాబాద్ ఇన్‌స్పాలెన్సీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (హెచ్‌ఐపీఏ) నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఎఫ్ క్లెయిమ్, ఇన్ స్పాలెన్సీ అండ్ బ్యాంక్ రప్సీకోడ్, 2016 (ఐబీసీ) గురించి చర్చించి, వాటికి పరిష్కార మార్గాలను చూపారు. పటాన్‌చెరు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్, ఇన్‌స్పాలెన్సీ ప్రొఫెషనల్ మల్లికార్జున్, మహదేవ్ తిరునగరి అవగాహన కల్పించారు. ఉద్యోగుల భవిష్య నిధి ప్రభావం గురించి న్యాయవాది, కంపెనీ సెక్రటరీ షేక్ గౌస్ చర్చించారు. పీఎఫ్ క్లెయిమ్‌లపై కేసులు, చట్టాలపై కాస్ట్ అకౌంటెంట్‌పై ఈఎస్ఎస్ఆర్ మూర్తి అవగాహన కల్పించారు. సహజంగా ఎదురయ్యే సమస్యలు, చట్టాలుపై న్యాయవాది హరిప్రసాద్ అవలోకనాన్ని అందించడం ద్వారా చర్చాగోష్ఠిని ముగించారు. కార్యక్రమంలో హెచ్ఐపీఏ సభ్యులు, ఉద్యోగుల భవిష్య నిధి ప్రాంతీయ కార్యాలయం పటాన్‌చెరు, బర్కత్‌పుర, మాదాపూర్, కూకట్‌పల్లి అధికారులు పాల్గొన్నారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్‌వర్మ పాల్గొన్నారు.

మెదక్ ప్రజల ఆశ, శ్వాసగా పనిచేస్తా..

- బీఆర్ఎస్ నడి సముద్రంలో మునిగే నావ
- మెదక్ పార్లమెంట్ ఎన్నిక ఏకపక్షమే
- బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మెదక్ జిల్లా పాపన్నపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్ అర్బన్/రామాయంపేట/పాపన్నపేట, మార్చి 29: మెదక్ ప్రజల ఆశ, శ్వాసగా పనిచేస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్‌లోని జంబికుంట, రామాయంపేట, పాపన్నపేటలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1980లో ఇందిరాగాంధీ మెదక్ నుంచి గెలిచి రైలు తెస్తానని హామీ ఇచ్చినా.. నాలుగు దశాబ్దాలుగా నెరవేరలేదన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో పనులను ఐదేళ్లల్లో చేసి చూపించారన్నారు. దుబ్బాక ఎన్నికల్లో తనను, తన కుటుంబాన్ని ఇబ్బంది పెట్టారని, రఘునందన్ కొడితే బీఆర్ఎస్ మొత్తం మునిగిపోయిందన్నారు. బీఆర్ఎస్ పరిస్థితి ఇప్పుడు నడిసముద్రంలో మునిగే నావలా తయారైందని విమర్శించారు. నడి సముద్రంలో మునిగిన పార్టీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతదన్నారు. గల్లీలో ఏది ఉన్నా.. ఢిల్లీలో మోదీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ లేకున్నా మెదక్ మీదుగా జాతీయ రహదారి, అనేక పనులు చేశానని గుర్తుచేశారు. తనను గెలిపిస్తే పెండింగ్ పనులను పూర్తి చేసి, మెదక్ ఆత్మగౌరవాన్ని కాపాడేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై, బీజేపీని ఓడించాలని కుట్ర చేస్తున్నాయని, కానీ మెదక్ పార్లమెంట్ ఎన్నిక ఏకపక్షమేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఆస్తులు రూ.17 కోట్లు అని ఎమ్మెల్సీ అఫిడవిట్‌లో చూపించారని, ఇప్పుడు రూ.100 కోట్లతో వీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేస్తానని చెబుతున్నారని, వెంకట్రామారెడ్డికి రాజపుష్ప కంపెనీతో సంబంధం ఉందో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ హోదాలో కేసీఆర్ కాళ్లకు దండం పెట్టిన వెంకట్రామారెడ్డికి ప్రజల్లో ఆదరణ ఉందా అని ప్రశ్నించారు. సూట్‌కేస్‌లు ఇచ్చి ఆయన టికెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులే పోటీ చేయలేక బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. మెదక్‌లో బీజేపీని అఖండ మెజారిటీతో గెలిపించే బాధ్యత కార్యకర్తలపైనే ఉన్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ఏనాడు ప్రజా సమస్యలపైన పోరాడింది లేదన్నారు. తనను గెలిపిస్తే పరిశ్రమలు తేవడమే కాకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేసి చూపుతానని హామీ ఇచ్చారు. ఆయా సమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రామాయంపేట జడ్పీటీసీ పంజా విజయ్, మెదక్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్, నాయకులు పంజావిజయ్, నందారెడ్డి, ఎంఎల్ఎన్‌రెడ్డి, మధు, ప్రసాద్, శ్రీపాల్, ప్రభాకర్, పాపన్నపేట మండలాధ్యక్షుడు బీకొండ రాములు, సీనియర్ నాయకులు సత్యం, సంతోష్ చారి, నరేష్, సుంకరి కిష్టయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

మనువాద బీజేపీ ఓడిస్తేనే రాజ్యాంగానికి రక్ష

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



సంగారెడ్డి పట్టణంలో పూలే, అంబేడ్కర్ జనజాతర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 29: మనువాద బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడిస్తేనే రాజ్యాంగానికి రక్షణ లభిస్తుందని కుల వివక్ష పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. సంగారెడ్డిలో పూలే, అంబేడ్కర్ జనజాతరకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ రక్షణ కోసం ఏప్రిల్ నెలలో పూలే, అంబేడ్కర్ జన జాతర, బైక్ యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బీజేపీ, బీఆర్ఎస్ఎస్ బాహాటంగా ప్రకటిస్తున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సహాయ కార్యదర్శులు ప్రవీణ్, దాస్, నాయకులు దత్తు, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి

జహీరాబాద్, మార్చి 29: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమైతుందని జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని హమాలీకాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా ప్రజలకు సమర్థవంతమైన పాలన అందుతుందని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం వివిధరకాల అభివృద్ధి, సంక్షేమపథకాలను అమలుచేసి ప్రజలను ఆదుకుంటుందన్నారు. ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసే మోదీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోమారు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. జహీరాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న బీబీపాటిల్ గెలుపుకోసం కలిసికట్టుగా కృషిచేయాలని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వనాథ్, శ్రీనివాస్‌గుప్తా, సంతోష్‌కుమార్, అప్పం శ్రవణ్, అరుణాకైలాస్, అర్చనసారడా, శోభారాణి, శారద, విజయ్, మురళి, దత్తు, విలాస్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తునికి నల్ల పోచమ్మ ఆలయ జాతర షురూ

- మొదటి రోజు అగ్ని గుండాలు

కౌడిపల్లి, మర్చి 29: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయ జాతరను శుక్రవారం దేవదాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. మూడు రోజుల జాతరలో భాగంగా మొదటి రోజు అగ్ని గుండాలు నిర్వహించారు. ఉదయం నుంచి జిల్లా నలుమూలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల పూనకాల నడుమ బోనాలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు నిర్వహించారు. కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. జాతరలో ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, పర్వతాలు, ప్రభాకర్‌చారి, మహేందర్ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీనారిగౌడ్, చల్ల పర్వతాలుయాదవ్ పాల్గొన్నారు.



తునికి నల్ల పోచమ్మ ఆలయం వద్ద అగ్ని గుండాలు తొక్కుతున్న భక్తులు

నాచగిరిలో నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

వర్గల్: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నాచారం గుట్ట శ్రీక్షేత్రం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతీ హాజరై ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆలయంలో ఆలయ వేద పండితులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారిణి ఎస్.అన్నపూర్ణ, వర్గల్ మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు జాలిగామ వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



నాచగిరిలో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం



అనంతసాగర్‌లో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు

అనంతసాగర్‌లో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం

చేగుంట: మెదక్ జిల్లా చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పెద్దమ్మ, పెద్ది రాజుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ముదిరాజులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఐదు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు దుర్గయ్య, భిక్షపతి, బోనగిరి నర్సింలు, మహేష్, నాగులు, భాగులు, నాగరాజు, చంద్రం, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, బీఆర్ఎస్ మీద ప్రజలకు కోపం లేదు

- బీఆర్ఎస్‌లో స్క్రాప్ అంతా తరలిపోయింది
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



జోగిపేటలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జోగిపేట, మార్చి 29 : గత ఎన్నికల్లో కేసీఆర్‌పై గానీ, బీఆర్ఎస్‌పైగానీ ప్రజలకు ఏమాత్రం కోపం లేదని శాసనసభ మాజీ స్పీకర్, బీఆర్ఎస్ నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోచారం మాట్లాడుతూ... అధికారంలో ఉన్నప్పుడు కుప్పలు తెప్పలుగా వచ్చిన స్క్రాప్ అంతా నేడు అధికారం పోగానే బీఆర్ఎస్ నుంచి తరలిపోయిందని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వీరంతా వెళ్లిపోవడంతో పార్టీకి పట్టిన శని వదిలిందన్నారు. కాంగ్రెస్ గొప్పగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను గ్యారంటీగా అమలు చేయలేదని, ఎలాగూ గెలిచాక అమలు చేసేది లేదని 420 హామీలను ఇచ్చిందని విమర్శించారు. ఇవి నెరవేరాలంటే సంవత్సరానికి రూ.3 లక్షల కోట్లు అవసరమవుతాయన్నారు. రాష్ట్ర బడ్జెటే అంత లేదని, ఇక ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. బీజేపీకి జైశ్రీరాం అని హిందువులను రెచ్చగొట్టడం, ఈడీ ఇన్‌కంటాక్స్ శాఖలతో బీఆర్ఎస్ నాయకులను బెదిరించడం తప్ప మరేమీ చేతగాదని పోచారం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

ఆస్తులను కాపాడుకునేందుకే షెట్కార్, పాటిల్ పోటీ

తమ ఆస్తులు, వ్యాపారాలను కాపాడుకోవడం కోసమే జహీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున సురేష్‌షెట్కార్, బీజేపీ తరఫున బీబీపాటిల్ బరిలో నిలిచారని పోచారం విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలకు ఏమీ చేయని వీరిద్దరూ సిగ్గు లేకుండా ప్రజలను ఓట్లడుగుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్ దెబ్బకు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు కొట్టుకుపోతారని ఆయన జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్లు నారాయణ, డీబీ నాగభూషణం, ఎం.మల్లికార్జున్‌గుప్తా, పల్లె సంజీవయ్య, ఎంపీపీ అధ్యక్షుడు జోగు బాలయ్య, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు హెచ్.రామాగౌడ్, జడ్పీటీసీ సభ్యుడు కే.రమేష్, నాయకులు సార శ్రీధర్, చాపల వెంకటేశం, పత్తి వీరేశం, లింగాగౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రూ.86లక్షలతో తరగతి గదుల నిర్మాణం

మునిపల్లి, మార్చి 29: మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని ఎల్అండ్‌టీ రీజినల్ హెడ్ వినీష్‌కుమార్ అన్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా ఎల్అండ్‌టీ ఐడీపీఎల్ డెక్కన్ టోల్వేస్ సౌజన్యంతో లింగంపల్లి గురుకుల పాఠశాలలో రూ.86లక్షలతో నాలుగు తరగతి గదులను నిర్మించారు. తరగతి గదులతో పాటు బోరుమోటారును శుక్రవారం ఎల్అండ్‌టీ ప్రాజెక్టు హెడ్ రాజేష్ విచారేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింగంపల్లి గురుకుల పాఠశాల, కాలేజీల అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం వారికి పాఠశాల ప్రిన్సిపాల్ చైతన్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్అండ్‌టీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లింగంపల్లి గురుకుల పాఠశాలలో తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు

కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య డిమాండ్



బొంతపల్లిలో కార్మికులకు కరపత్రాలను పంచుతున్న సీఐటీయూ నాయకులు

గుమ్మడిదల, మార్చి 29: పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఈ మేరకు జీవోను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడలో కార్మికుల నివాసాల వద్దకు వెళ్లి సీఐటీయూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. పరిశ్రమలలో ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ పరిశ్రమల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమలలో కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని కోరారు. కొన్ని పరిశ్రమలలో 12 గంటలు పని చేయించుకొని కార్మికులకు పదివేల రూపాయల వేతనం ఇస్తున్నారని చెప్పారు. 12 గంటల పని వేళలను తొలగించి, 8 గంటల పనివేళలు కల్పించాలని కోరు. లేదంటే ఆ పరిశ్రమల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవి, నర్సింహాగౌడ్, హుస్సేన్, గోపాల్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్



వీసీని సన్మానిస్తున్న అధికారులు

ములుగు, మార్చి 29: మహిళలు అన్ని రంగంలో రాణించాలని కొండా లక్ష్మణ్ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హార్టికల్చర్ యూనివర్శిటీ పరిపాలనా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు స్ఫూర్తిదాయక అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు ముఖ్యమైన పాత్ర పోషిస్తారని, భారతీయ మహిళలు మార్పుకు ప్రేరణ అని అన్నారు. కార్యక్రమంలో ఎ. భగవాన్, రిజిస్ట్రార్, డి. విజయ, డీఎస్‌ఏ, డీఆర్ఎం రాజశేఖర్, డీహెచ్ నటరాజన్, సీఓఈ, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, పీజీ విద్యార్థుల బోధన, బోధనేతర, కాంట్రాక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

● సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

సిద్ధిపేటరూరల్, మార్చి 29: కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం సిద్ధిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మి భర్త మల్లయ్య, తోర్నాల మాజీ సర్పంచ్ దేవయ్య, సిద్ధిపేట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, రాంపూర్ కొడూరు రాజు, బుస్సాపూర్ ఉపసర్పంచ్ భగవాన్ రెడ్డిలు ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.



మాజీ సర్పంచులకు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న హరికృష్ణ

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉపసర్పంచ్

కొండపాక, మార్చి 29: మండలంలోని సిరిసినగండ్ల మాజీ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల రమేష్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరాడు. హైదరాబాద్‌లోని మైనంపల్లి హనుమంతరావు నివాసంలో డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నరసారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరాడు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు చేర్చాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, నాయకులు తిమ్మారెడ్డిపల్లి వెంకటేశం గౌడ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్, గ్రామ అధ్యక్షుడు చెంది కరుణాకర్, యూత్ అధ్యక్షుడు గవ్వల కనకమల్లు, వేముల బాబు, సముద్రాల భాను, వేముల నరేష్ పాల్గొన్నారు.

గ్రూప్ రాజకీయాలకు స్వస్తి పలకండి

ములుగు, మార్చి 29: మండలంలోని కాంగ్రెస్‌లో ఉన్న గ్రూప్ రాజకీయాలకు స్వస్తి పలికి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని వంటిమామిడిలో ఆయన మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా కాంగ్రెస్ అధికారంలో లేకపోయినప్పటికీ పార్టీలో ఉంటూ, సర్పంచ్‌గా కొనసాగుతూ గత ప్రభుత్వం ఒత్తిళ్లకు లొంగకుండా ఉన్నామన్నారు. ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత ములుగు మండలంలో రెండు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే యమునా తీరన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా నాయకత్వం కల్పించుకుని మండలంలో ఉన్న గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికేలా చూడాలని కోరారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, మార్చి 29: భార్య వదిలి వెళ్లడంతో మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాకలో శుక్రవారం చోటుచేసుకున్నది. దుబ్బాక శివారులోని రామలింగారెడ్డి కాలనీలో నివసించే కాలియా జయరాం భార్య ఆరునెలల క్రితం అతన్ని వదిలి, వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. దీంతో మానసికంగా కుంగిపోయిన జయరాం మద్యానికి బానిసగా మారాడు. శుక్రవారం తన గుడిసెలో తల్లితండ్రులు లేని సమయంలో గుడిసెలోని దులానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటానని జయరాం తన ఫోన్‌లో వీడియో రికార్డు చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో దుబ్బాక ఎస్ఐ గంగరాజు వెంటనే అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి



నర్సింలు మృతదేహం

రాయపోల్, మార్చి 29: చేపలవేటకు వెళ్లిన వ్యక్తి కుంటలో మునిగి మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం రామారం గ్రామంలో చోటుచేసుకున్నది. మృతుని బంధువులు, ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన విభూతి నర్సింలు(42) భార్యతో విడాకులు తీసుకొని కొన్నేళ్లుగా తిర్మలాపూర్‌లో తల్లి వద్ద ఉంటున్నాడు. అతడు తరుచుగా చేపల వేటకు వెళ్లి వాటిని విక్రయించేవాడు. ఈ క్రమంలో గురువారం చీకటి పడిన తర్వాత ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. శుక్రవారం కుటుంబసభ్యులు అతని కోసం చుట్టుపక్కల గ్రామాల్లో వెతుకుతుండగా రాయపోల్ మండలం రామారం గ్రామ శివారులో ఉన్న కుంట వద్ద అతని చెప్పులు, దుస్తులు కనిపించాయి. దీంతో కుంటలో గాలించగా నర్సింలు మృతదేహం లభించింది. మృతుని సోదరుడు విబూది దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన ట్రాలీ ఆటో



కారు ఢీకొట్టిన ట్రాలీ ఆటో

కుకునూరుపల్లి, మార్చి 29: ఆగి ఉన్న కారును ట్రాలీ ఆటో ఢీకొన్నది. ఈ సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. కొండపాక మండలం సిరిసనగండ్ల గ్రామానికి చెందిన ఐలయ్య తన ఆటోలో మిట్టపల్లి నుంచి గజ్వేల్‌కు ప్రయాణికులతో వెళ్తున్నాడు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని కమన్ వద్దకు రాగానే ఐలయ్యకు కళ్లు తిరగడంతో రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ చేయి విరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారికి, కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పండ్ల ఆటో బోల్తా

మిరుదొడ్డి, మార్చి 29: మండలంలోని ధర్మారం గ్రామంలో సిద్దిపేట నుంచి వస్తున్న ఆటో రహదారిపై బోల్తాపడి, ఆటోలో ఉన్న లక్ష రూపాయల విలువ చేసే ద్రాక్ష, అరటిపండ్లు పాడయ్యాయి. ఈ ఘటనలో ఆటో నడుపుతున్న డ్రైవర్ చంద్రంకు తీవ్రగాయాలైయ్యాయి. అతన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బోర్డుపై నూతన అధికారుల పేర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిన్నకోడూరు, మార్చి 29: నూతన అధికారులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టినా చిన్నకోడూరు పోలీసుస్టేషన్‌లోని సమాచార హక్కు చట్టం బోర్డుపై పాత సీఐ, ఎస్ఐ పేర్లే ఉండటంతో 'అధికారులు మారినా బోర్డు పై పాత పేర్లేనా' అన్న శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఫొటో కథనానికి అధికారులు స్పందించారు. సమాచార హక్కు చట్టం బోర్డుపై పాత సీఐ, ఎస్ఐ పేర్లను తొలగించి నూతన సీఐ, ఎస్ఐ పేర్లను రాశారు.

ఎన్నికలకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

● సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

నారాయణరావుపేట, మార్చి 29: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను కోరారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ వద్ద జిల్లా సరిహద్దులోని చెక్ పోస్టును, గ్రామంలోని పోలింగ్ బూత్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో అభ్యంతర కరంగా పోస్టులు చేయరాదని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదు తీసుకెళ్తె సీజ్ చేసి జిల్లా గ్రీవియెన్స్ కమిటీకి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నకోడురు ఎస్ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టికెట్ కేటాయించడం హర్షణీయం

నారాయణరావుపేట, మార్చి 29: కాంగ్రెస్ మెదక్ పార్లమెంటు స్థానాన్ని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుకు కేటాయించడం హర్షణీయమని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ముదిరాజ్ సామాజిక వర్గాన్ని రాజకీయంగా అణిచివేసేందుకు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు జరిగాయన్నారు. ముదిరాజ్‌లు రాజకీయ హక్కుల కోసం రోడ్డు ఎక్కకముందే ఉద్యమాన్ని నీరు గార్చే విధంగా గత పాలకులు చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల అశోక్, బీసీ సెల్ జిల్లా నాయకులు తీగల భాస్కర్, గ్రామ అధ్యక్షుడు బోయిని బాలయ్య ఉపాధ్యక్షుడు మాట్ల రాజు, గౌరవ అధ్యక్షుడు నక్క కాంతయ్య, ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, సీనియర్ నాయకులు పల్లె పర్శరాములు, కిసాన్ సెల్ అధ్యక్షుడు సారుగు కనకయ్య, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుంచు కనకయ్య ,మైనారిటీ అధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం, నాయకులు పాల్గొన్నారు

'మత్స్యకారులు లక్షాధికారులు కావాలి'

చేర్యాల, మార్చి 29: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులు లక్షాధికారులుగా మారాలని రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం మత్స్యకార ఉత్పత్తిదారుల సంఘాల పాలక వర్గసభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్పత్తిదారుల సంఘ పాలకవర్గ సభ్యులు మత్స్యకారుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, వ్యవసాయ, చేపల ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గీస బిక్షపతి, ప్రకృతి పర్యావరణ సంస్థ అధ్యక్షుడు మాధవరావు, మత్స్యకారసంఘాల ప్రాజెక్ట్ ఇన్‌చార్జి నారదాసు ఈశ్వర్, ప్రతినిధులు తిరుపతి, ఇస్తారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కుకునూరుపల్లి బీజేపీలో ముసలం

● మండల అధ్యక్షుడిపై తిరుగుబాటు

కుకునూరుపల్లి, మార్చి 29: కుకునూరుపల్లి బీజేపీలో ముసలం మొదలైంది. గురువారం ప్రకటించిన మండల కమిటీ నియామకమే దీనికి కారణం. దీంతో పలువురు నాయకులు తమ పదవులకు రాజీనామా చేశారు. తిప్పారం గ్రామానికి చెందిన కోరె సంతోష్, బొప్పాయిపల్లికి చెందిన రెడ్డమైన లింగం శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడు ఒంటెద్దు పోకడలతో జిల్లా కమిటీలో పని చేస్తున్న ఓ నాయకుడికి వంత పాడుతూ, ఇద్దరు కలిసి వారి సామాజిక వర్గానికే పదవులను కట్టబెట్టారని, సంవత్సరాలుగా పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీతోనే దేశసమగ్రాభివృద్ధి

● బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు

చేర్యాల, మార్చి 29: బీజేపీతోనే దేశసమగ్రాభివృద్ధి జరిగి ప్రజల కష్టాలు తీరుతాయని బీజేపీ కొమురవెల్లి మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకుల బృందం పర్యటించి కేంద్ర పథకాల లబ్ధిదారులను కలిసి ప్రధాని మోదీకి, బీజేపీ అండగా ఉండాలని కోరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్నిరంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. కేంద్ర పథకాలు పారదర్శకంగా ఇంటింటికీ చేరాయని, వచ్చే పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, భిక్షపతి, బచ్చల నర్సింహులు, గనబోయిన శ్రీనివాస్, కొయ్యడ మల్లేశం, ఎక్కలదేవి మధు, బ్రాహ్మణపల్లి బాబు, ఈగ కనకయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తిలో ఇఫ్తార్ విందు

వెల్దుర్తి, మార్చి29: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని మజీద్‌లో ముస్లిం సోదరులకు కాంగ్రెస్ నాయకులు ఆవుల మల్లేష్‌చారి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవులరాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. వెల్దుర్తిలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి,పోతిరెడ్డి, కృష్ణ, శంకరయ్యగౌడ్ ఉన్నారు

చరిత్ర విభాగంలో డాక్టరేట్

కోహెడ, మార్చి 29 : కోహెడ మండలం పరివేద గ్రామానికి చెందిన ఈదులకంటి (రేమిడి) అనితకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ద రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ లెఫ్టిస్ట్ మూమెంట్స్ ఇన్ తెలంగాణ అనే అంశంపై కేయూ చరిత్ర విభాగం ప్రొఫెసర్ పి సదానందం పర్యవేక్షణలో అనిత డాక్టరేట్ పూర్తి చేశారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్ నియామకం

కొండపాక , మార్చి 29: బీజేవైఎం కొండపాక మండల అధ్యక్షుడిగా అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రవీణ్‌గౌడ్‌ను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. తన మీద నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్‌రెడ్డి, కొండపాక మండల అధ్యక్షుడు నీలం సత్యం, బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు నీలం దినేష్‌లకు కృతజ్ఞతలు తెలిపాడు.

నేడు బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

గజ్వేల్, మార్చి 29: నడు గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఓ రిసార్టులో నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెంకట్రామారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు హాజరవనున్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసిన భాస్కర్

కొండపాక, మార్చి 29: హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయిన అయ్యారపు రవీందర్ రెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొండపాకకు చెందిన గుడాల భాస్కర్ శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపాడు.

కల్లు దుకాణంపై దాడి.. కేసు నమోదు

తూప్రాన్, మార్చి 29: తూప్రాన్ పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ కల్లు దుకాణంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్‌లో అక్రమంగా కల్లు దుకాణం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు వివరించారు. అల్లాపూర్‌కు చెందిన అశోక్‌గౌడ్ అక్రమంగా కల్లుదుకాణం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిలువ ఉంచిన 132 బాటిళ్ల కల్లును సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పన్ను చెల్లించలేదని పాఠశాల గేటుకు తాళం



గేటుకు తాళం వేస్తున్న మునిసిపల్ సిబ్బంది

చేర్యాల, మార్చి 29: ఆస్తిపన్ను బకాయి పడడంతో చేర్యాల పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ గేటుకు మునిసిపల్ అధికారులు తాళం వేశారు. ఈసందర్భంగా మునిసిపల్ మేనేజర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆస్తిపన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని, ఈనెల 31వ తేదీలోగా చెల్లించి 90శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయనవెంట మునిసిపల్ సిబ్బంది సర్వర్, శ్రీనివాస్, ప్రీతం, గంగాధర్, వెంకటేశ్, శ్రవణ్ ఉన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల్లో డిజీల్ దొంగతనం

దుబ్బాక, మార్చి 29: దుబ్బాక ఆర్టీసీ డిపోలో అద్దెప్రతిపాదికన నడిపిస్తున్న రెండు బస్సుల్లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు డిజీల్ దొంగతనం చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాకకు చెందిన బూరుస్వామి తన రెండు బసులను అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ దుబ్బాకలో నడిపిస్తున్నాడు. స్థానిక బస్ డిపో గేటు ఎదుట నిలిపిన ఈ బస్సుల్లోంచి డిజీల్ ట్యాంక్ తాళం పగలకొట్టి, సుమారు 250 లీటర్ల డిజీల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు ఆయన తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

వెంకట్రామారెడ్డిని కలిసిన నాయకులు

గజ్వేల్, మార్చి 29: మెదక్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అరుణాభూపాల్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డిలు కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. తనను ఆదరించి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొన్నాం.. భత్యం ఇవ్వరా?

నారాయణఖేడ్, మార్చి 29: అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించినప్పటికీ భత్యం ఇవ్వకుండా ఆర్డీవో కార్యాలయం అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని డివిజన్ పరిధిలోని రెవెన్యు ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల సందర్భంగా 54 రోజులు డివిజన్ పరిధిలోని 200 మంది వరకు వీఆర్ఏలు, రికార్డు అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు విధుల్లో పాల్గొన్నారని వివరించారు. దీంతో తమకు వేతనం ఆధారంగా రోజుకు రూ.200ల నుంచి 300ల వరకు భత్యం ఇవ్వాల్సి ఉందన్నారు. ఎన్నికలు పూర్తయి మూడు నెలల దాటినా తమకు భత్యం అందలేదన్నారు. డివిజన్ కేంద్రంలోని నారాయణఖేడ్ మండలానికి చెందిన కొందరికి మాత్రం భత్యం ఇచ్చి, మిగతా మండలాల వారికి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇతర నియోజకవర్గాలలో భత్యం ఇచ్చినప్పటికీ, తమ నియోజకవర్గంలో విధులు నిర్వహించిన వారికి మాత్రం భత్యం ఇవ్వడం లేదన్నారు. వెంటనే భత్యం ఇవ్వాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని, ఉద్యోగుల సంఘం నాయకులు గుండు మోహన్ హెచ్చరించారు.

'ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలి'

కంగ్టి, మార్చి 29: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని దెగ్లూర్ గుండా మహారాజ్ పీఠాధిపతి చంద్రశేఖర్ మహారాజ్ పేర్కొన్నారు. కంగ్టిలో జరుగుతున్న సప్తాహ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఆయన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. మహారాజ్ చేసిన మరాఠీ ప్రవచనాలు భక్తులు తన్మయులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి నామస్మరణకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రావుదేశ్, బాబు మహారాజ్, నర్సింహులు, సిద్దేశ్వర్, ఆలయ చైర్మన్ వెంకట్, మనోజ్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు రూ. 1,39,73,062

మద్దూరు, మార్చి 29: మద్దూరు ఉమ్మడి మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో సుమారు రూ.1,39,73,062ల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. ప్రతీ నెల బిల్లుల వసూళ్లలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే బిల్లులు పేరుకుపోయినట్లు తెలుస్తున్నది. ఒక్కో గ్రామపంచాయతీ ఇంటి, నల్లా పన్నులు వసూళ్లు చేస్తున్నా నీటి సరఫరా, వీధి దీపాలకు వినియోగిస్తున్న విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి.

గ్రామాల వారీగా బకాయిల వివరాలు

మద్దూరు గ్రామపంచాయతీ రూ.14,60,000, రేబర్తి రూ.4,70,000, వల్లంపట్ల రూ.7,70,000, వంగపల్లి రూ.1,60,000, గాగిళ్లాపూర్ రూ. 6,50,000, నర్సాయపల్లి రూ. 7,90,000, లద్నూరు రూ.8,60,000, ధర్మారం రూ. 2,00,000, మర్మాముల రూ. 4,70,000, సలాఖ్‌పూర్ రూ.3,70,000, కూటిగల్ రూ. 93,675, రెడ్యానాయక్ తండా రూ.5,03,004, భైరాన్‌పల్లి రూ.2,51,716, బెక్కల్ రూ.6,99,825, కొండాపూర్ రూ.2,93,931, దుబ్బతండా రూ.6,66,564, హన్మతండా రూ.3,53,471, అర్జున్‌పట్ల రూ.7,34,502, లింగాపూర్ రూ.7,93,767, కమలాయపల్లి రూ. 1,80,259, జాలపల్లి రూ.8,70,080, దూళిమిట్ట రూ.22,10,275, తోర్నాల రూ.1,21,993ల విద్యుత్ బకాయిలు ఉన్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం



విద్యుత్ బిల్లులు చెల్లించని గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. బిల్లులు చెల్లించని జీపీల విషయమై ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయ అధికారుల సమన్వయంతో బిల్లుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- సుధీర్‌బాబు మద్దూరు విద్యుత్ ఏఈ

రేపు తొగుటలో సీతారామచంద్రస్వామి కల్యాణం



పీర్లపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ

తొగుట, మార్చి 29: మండల కేంద్రమైన తొగుటలో ఈ నెల 31న సీతారామాంజనేయస్వామి ఆలయ పంచదశ వార్షికోత్సవాలను పురస్కరించుకుని సీతారామచంద్రస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సీతారాముల కల్యాణ మహోత్సవం రంగంపేట పీఠాధిపతి శ్రీ మాదవానంద సరస్వతీ స్వామి, అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు పార్థంది జయరామ శర్మ, శ్రీరాం కల్యాణ్ వెంకట్‌రామ్ శర్మ ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జగదేవ్‌పూర్‌లో

జగదేవ్‌పూర్, మార్చి 29: జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మ దేవతల ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవత విగ్రహాలకు జలాధివాస, ధాన్యాధివాస, సామూహిత రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాద వరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పండితులు విఠల్‌శర్మ, మాధవశర్మ, గ్రామ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నారాయణరావుపేటలో

నారాయణరావుపేట, మార్చి 29: బీరప్ప కామరతి కల్యాణ వేడుకలను శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు నారాయణరావుపేట మండలం మల్యాల కురుమ సంఘం ప్రతినిధులు రామచంద్ర, ఎల్లయ్యలు తెలిపారు. గ్రామంలోని బీరప్ప కామరతి కల్యాణ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

చెరువు నీటిని కలుషితం చేయవద్దు

● ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయభాస్కర్‌రెడ్డి

గజ్వేల్‌టౌన్, మార్చి 29: చెరువులోని నీటిని కలుషితం చేయవద్దని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 స్పెషల్ క్యాంపులో భాగంగా రెండో రోజు వలంటీర్లు చెరువు పరిసరాలను, ప్రాథమిక పాఠశాల ఆవరణను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రజలకు చెరువుతో అవినాభావ సంబంధం ఉంటుందని, వ్యవసాయం చేయడానికి చెరువు నీరే ప్రధాన ఆధారం అని, అలాంటి చెరువులను కలుషితం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు మాట్లాడుతూ.. చెరువులు పరిశుభ్రంగా ఉంటే మానవాళికి, జంతు సమూహానికి ఎలాంటి వ్యాధులు రావని, అలాంటి చెరువులలో కొంతమంది స్వార్థంతో చెత్తాచెదారం, గృహ వ్యర్థాలు, రసాయనిక వ్యర్థాలు పారేసి నీటిని కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజు, సాయికృష్ణ, ఎంపీటీసీ బెల్దె క్రిష్ణ, పీఏసీఎస్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, గ్రామ నాయకులు సుకేందర్‌రెడ్డి, గ్రామస్థులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ధర్మారెడ్డిపల్లి ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీరు

దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి రూ.25,016 విరాళం అందజేత

దూళిమిట, మార్చి 29: మండలంలోని భైరాన్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి ఉమ్మడి మద్దూర్ మండల ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు బెక్కల్, తోర్నాల ఎంపీటీసీ ఆకుల యాదగిరి రూ.25,016 చెక్కు రూపంలో విరాళంగా శుక్రవారం అందించారు. అడగగానే విరాళాన్ని అందించిన ఎంపీటీసీ ఆకుల యాదగిరికి దుర్గమ్మ ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో భైరాన్‌పల్లి ఎంపీటీసీ నర్సింహులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ భద్రప్ప, భైరాన్‌పల్లి గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'బస్ పాస్‌లు సద్వినియోగం చేసుకోవాలి'

మనోహరాబాద్, మార్చి 29: ఆర్టీసీ గ్రేటర్ హైదారాబాద్ జోన్ పరిధిలో ఉన్నటువంటి మనోహరాబాద్ మండల కేంద్రంలో దివ్యాంగులు ఉచిత బాస్ పాస్‌ల స్పెషల్ కాంప్ మేళా శనివారం నిర్వహించనున్నారు. మండలంలోని ఎంపిడీవో కార్యాలయంలో ఉదయ 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మేళా నిర్వహించనున్నారు. మండలంలోని దివ్యాంగులు ఏవరైనా ఉంటే శనివారం ఉదయం ఎంపిడీవో కార్యాలయంలో ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో, సదరం సర్టిఫికెట్ కాపీ, ఆధార్ కార్డు, ఐడీకార్డు సర్వీస్ చార్జ్ కోసం 50 రూపాయలు తీసుకొని వెళ్లి నమోదు చేసుకోవాలని గ్రేటర్ హైదారాబాద్ జోన్ టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వేంకటేశ్వర్లు తెలిపారు.

గ్రామ గ్రామాన ఘనంగా గుడ్ ఫ్రైడే



పాములపర్తిలో ప్రత్యేక ప్రార్థనను నిర్వహిస్తున్న సంఘ సభ్యులు



చిన్నకోడూరు మండలం రామునిపట్ల సీఎస్ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



చేర్యాల చర్చిలో ప్రార్థనలు చేస్తున్న స్థానికులు

మద్దూరు, మార్చి 29: మండలంలోని అన్ని గ్రామాల్లోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా లద్నూరు బేతనియ ప్రార్థన మందిరంలో పాస్టర్ డేవిడ్ మాట్లాడారు. ఉదయం నుంచి ఉపవాసంతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుదర్శన్, జాకబ్, జయరాజ్, రాజ్‌కుమార్, ఏలి, జయ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక పార్థనలు చేశారు.

● **చేర్యాల:** గుడ్ ఫ్రై డే వేడుకలను శుక్రవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. షాలేం ప్రార్థన మందిరంలో బ్రదర్ అందె విజయ్‌కుమార్, ఐఎంఐ కాంపౌండ్ చర్చిలో పి. ప్రభుదాసు ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

● **మర్కుక్:** గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాములపర్తి చర్చిలో సంఘసభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఇసాక్ మాట్లాడుతూ.. మనిషిలో ఆవేశాన్ని తగ్గించి ఆలోచనలను పెంపొందించాలని ప్రభు ఏసు తెలిపారని అన్నారు.